క్లుప్తంగా

చిన్ననాటి స్నేహితులకు సాయం



వాతాడి లక్ష్మికి ఫర్నీచర్, నిత్యావసర వస్తువులు అందజేస్తున్న గోల్డెన్ గ్రూపు ప్రతినిధులు

తాళ్లరేవు: స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు రోళ్ల చక్రవర్తి, దంగేటి రాంబాబు, అన్నామణి తదితరులు గోల్డెన్ గ్రూపుగా ఏర్పడి చిన్ననాటి తమ మిత్రులకు సాయం అందించారు. కోరంగిలో అద్దె ఇంట్లో నివాసముంటున్న వాతాడి లక్ష్మికి రూ.25 వేల విలువజేసే ఫర్నీచర్, నిత్యావసర వస్తువులను బుధవారం అందజేశారు. వాతాడి లక్ష్మితో పాటు మోర్త డేవిడ్ రాజులకు ప్రతి నెలా రూ.1,000 చొప్పున అందిస్తామని హామీ ఇచ్చారు.

నేడు వైఎస్సార్ ఆసరా రుణమాఫీ

ఐ.పోలవరం: వైఎస్సార్ ఆసరా డ్వాక్రా రుణమాఫీ కార్యక్రమం మురమళ్ల జెడ్పీ పాఠశాల వెనుక ఉన్న ఖాళీ స్థలంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

వ్యక్తిపై కేసు

అయినవిల్లి: స్థల వివాదం నేపథ్యంలో గాయపర్చిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం తొత్తరమూడి పెదపాలెం గ్రామానికి చెందిన కాండ్రేగుల మోహన్‌కృష్ణను అదే గ్రామానికి సమీప బంధువు కుడుపూడి వెంకటేశ్వరరావు ఇంటి స్థలం వివాదం నేపథ్యంలో గాయపరిచాడన్నారు. దీనిపై బాధితుడు మోహన్‌కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తైక్వాండో మాస్టర్ అబ్బులుకు అభినందనలు

ఆలమూరు: కుంగ్‌ఫూ, కరాటే, మార్షల్ ఆర్ట్స్ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి ఎందరో విద్యార్థులకు శిక్షణను ఇస్తున్న తైక్వాండో మాస్టర్ టి.అబ్బులుకు అభినందనలు వెల్లువెత్తాయి. రాష్ట్ర వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి బుధవారం జొన్నాడ పర్యటనకు విచ్చేసిన సందర్భంగా మాస్టర్ అబ్బులు మర్యాదపూర్వకంగా తన విద్యార్థులతో శాప్ చైర్మన్ బైరెడ్డితో కలిశారు.

వైభవంగా చక్రస్నానం

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసిన పార్వతీ సమేత మేనకేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామా సమేత కృష్ణరాయుడు స్వామి వార్ల కల్యాణంలో భాగంగా బుధవారం స్వామి వార్లకు చక్రస్నానాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తలంక బుజ్జి ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి జాతర

అంబాజీపేట: మాచవరంలో వేంచేసియున్న మహాలక్ష్మి అమ్మవారి జాతరను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జాతరలో పూజాఘటాలతో పాటు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణం వద్ద గురువారం తీర్థం ఏర్పాటు చేయనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అరిగెల నాగబాబు, నారిన శ్రీనివాసరావు తెలిపారు.

నేడు ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రారంభం

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాంను తొండవరం సచివాలయం వద్ద గురువారం ఉదయం ప్రారంభించనున్నట్లు మండల వైద్యాధికారి వి.గౌతమి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు.

టీకాలు వేయించాలి

అంబాజీపేట: పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని సీహెచ్ఓ బి.అప్పారావు అన్నారు. నందంపూడిలో సార్వత్రిక వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులకు సీజనల్ వారీగా టీకాలు వేయించుకునేలా వారి తల్లిదండ్రులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆత్రేయపురం వీఆర్ఏపై కేసు

ఆత్రేయపురం: గ్రామానికి చెందిన వీఆర్ఏపై బుధవారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. వివరాలు ప్రకారం ఆత్రేయపురం వీఆర్ఏ వారా ప్రకాష్ అదే గ్రామానికి చెందిన ఆశ వర్కర్‌తో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భవిత కేంద్రాలు.. మార్పునకు చిహ్నాలు

- విభిన్న ప్రతిభావంతుల పాలిట వరంగా కేంద్రాలు
- ప్రత్యేక బోధన పద్ధతులతో పిల్లలకు శిక్షణ
- ప్రతి నెలా ట్రాన్స్‌పోర్ట్, హోం బేస్డ్, ఎస్కార్ట్ అలవెన్సులు



గోడిలంకలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులకు శిక్షణనిస్తున్న ఉపాధ్యాయుడు

అల్లవరం: భవిత కేంద్రాలు.. నిజమైన సేవకు చిహ్నాలు.. మండల కేంద్రాల్లో నెలకొల్పిన భవిత కేంద్రాలు ప్రత్యేక అవసరాల పిల్లల పాలిట దేవాలయాలుగా మారుతున్నాయి. విభిన్న ప్రతిభావంతులకు సమాజంలో ప్రత్యేక స్థానం కల్పించేందుకు ఆయా కేంద్రాంల్లో నిరంతర కృషి జరుగుతోంది. మాటలు రాని పిల్లలకు మాటలు నేర్పడం, చూపు లేనివారికి బ్రెయిలీ లిపి ద్వారా అవగాహన పరచడం, నడవలేని పిల్లలకు ఫిజియోథెరపీ ద్వారా నడక నేర్పడం, బుద్ధి మాంద్యం ఉన్న పిల్లలకు వారి పనులు వారే చక్కబెట్టుకునేలా తర్ఫీదునివ్వడం వంటి శిక్షణను అక్కడ అందిస్తున్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలు పుడితే భారంగా భావించే ఈ రోజుల్లో వారికి భరోసాగా ఉంటూ, నిత్యం వారితోనే గడుపుతూ సభ్య సమాజంలో వారికి ప్రత్యేక స్థానం కల్పిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయుల సేవలైతే అనిర్వచనీయం..

అమలాపురం, ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఏడు భవిత కేంద్రాలు ద్వారా 115 మంది విభిన్న ప్రతిభావంతులను సభ్య సమాజంలో కలిపేందుకు తర్ఫీదునిస్తున్నారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను సైతం అందిస్తోంది. ప్రతి నెల ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు, హోం బేస్డ్ చార్జీలు, ఎస్కార్ట్ చార్జీలు, బాలికలకు ప్రత్యేక నిధి వారి తల్లుల ఖాతాలకు జమ చేస్తున్నారు. నెలకి రూ.300 చొప్పున చార్జీలు, బాలికలకు ప్రత్యేక నిధిగా అదనంగా మరో రూ.200 అందిస్తున్నారు.

మండలం	విభిన్న ప్రతిభావంతులు	బోధిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులు
అల్లవరం	22	2
ఉప్పలగుప్తం	17	1
అమలాపురం	19	1
ముమ్మిడివరం	30	2
ఐ.పోలవరం	22	2
కాట్రేనికోన	16	1
తాళ్లరేవు	10	1

ప్రోత్సాహకాలతో ఊరట



భవిత కేంద్రాలు ప్రత్యేక అవసరాల పిల్లలకు భరోసానిస్తున్నాయి. ప్రభుత్వం తరఫున ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు, హోం బేస్డ్ చార్జీలు, ఎస్కార్ట్ చార్జీలు ప్రతి నెలా ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. ఎలాంటి ఆధారం లేనివారికి ఈ ప్రోత్సహకాలు ఎంతో ఊరటనిస్తాయి.

– నాగిరెడ్డి నరసవేణి, విద్యార్థి తల్లి, బెండమూర్లంక

ప్రత్యేక బోధన పద్ధతులతో శిక్షణ



విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు భవిత కేంద్రంలో మాటలు నేర్పడం, చూపు లేని వారికి బ్రెయిలీ లిపి నేర్పడం చేసి సమాజంలో వారికి ప్రత్యేక స్థానం కల్పించేందుకు కృషి చేస్తున్నాం. పిల్లలకు ప్రత్యేక బోధన పద్ధతుల ద్వారా శిక్షణ అందిస్తున్నాం. వారికి సేవ చేయడం మా బాధ్యతగా భావిస్తున్నాం.

– తంగెళ్ల శ్రీనివాస్, ప్రత్యేక ఉపాధ్యాయుడు, భవిత కేంద్రం, గోడిలంక

సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పరిధిలోని హోప్ ఐలాండ్ దీవిలో నివాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తాళ్లరేవు ఎంపీపీ రాయుడు సునీత హామీ ఇచ్చారు. బుధవారం హోప్ ఐలాండ్‌లో పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా తాము తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఎంపీపీకి విన్నవించారు. తాము వేట సాగించేందుకు అవకాశమివ్వకుండా కొందరు ఇబ్బంది పెడుతున్నారని ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, సంబంధిత అధికారులతో చర్చించి తగు చర్యలు చేపడతామని ఎంపీపీ వారికి భరోసా ఇచ్చారు. అనంతరం స్థానిక సంరక్షణ కేంద్రంలో పెంచుతున్న ఆలివ్ రిడ్లే తాబేళ్లను ఎంపీపీ సముద్రంలోకి వదిలారు. కార్యక్రమంలో రాయుడు గంగాధర్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసరాతో మహిళలకు ఆర్థిక స్వావలంబన



వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

- డ్వాక్రా రుణాల మాఫీతో ఉపాధికి బాటలు
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం టౌన్: వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా డ్వాక్రా రుణమాఫీ ద్వారా వచ్చిన సొమ్ముతో మహిళలు కొత్త ఉపాధికి బాటలు వేసుకుంటున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురం పట్టణానికి సంబంధించి ఆసరా లబ్ధిదారులతో స్థానిక బాలయోగి స్టేడియంలో బుధవారం జరిగిన సదస్సులో మంత్రి విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణంలో 637 స్వయం సహాయక సంఘాలకు చెందిన 6,297 మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడో విడతగా వచ్చిన రూ.5,17,42,957 నమూనా చెక్‌ను మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ రుణమాఫీ ద్వారా మహిళలు తమ సంఘాలకు, తమకు సమకూరిన డబ్బుతో కొత్త వ్యాపారాలు కొందరు ఆరంభిస్తే, మరికొందరు ఉన్న వ్యాపారాలకు మరింత పెట్టుబడులు పెట్టి వృద్ధి చేసుకుంటున్నారన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

సభా వేదిక వద్ద మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కౌన్సిలర్లు, డ్వాక్రా మహిళలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సదస్సులో 15 ఏళ్ల బాలిక మెండా వెంకట మహాలక్ష్మి ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న నవరత్న పథకాల గురించి చేసిన ప్రసంగం సభికులను ఆకట్టుకుంది. చిన్నారులు చేసిన నృత్య రూపక ప్రదర్శనలు సైతం అందరినీ అలరించాయి. కార్యక్రమంలో రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, వంటిద్దు వెంకన్నాయుడు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వం నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.2 లక్షల కోట్లు నేరుగా ప్రజల బ్యాంకు ఖాతాలకు జమ చేసిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. బాలయోగి స్టేడియంలో బుధవారం సాయంత్రం జరిగిన అమలాపురం రూరల్ మండలం ఆసరా మూడో విడత రుణమాఫీ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ మండల పరిధిలో 1817 సంఘాలకు రూ.16.34 కోట్లు మూడో విడతలో లబ్ధి పొందారన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మి

కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి విశ్వరూప్



మంత్రి విశ్వరూప్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మి తదితరులు

అమలాపురం టౌన్: గత మున్సిపల్ ఎన్నికల్లో స్వతంత్ర కౌన్సిలర్‌గా గెలుపొందిన అమలాపురం 15వ వార్డు కౌన్సిలర్ వాసర్ల లక్ష్మి తన మద్దతుదారులైన సుమారు 100 మందితో కలిసి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. బుధవారం స్థానిక సర్ ఆర్థర్ కాటన్ అతిథి గృహంలో మంత్రి విశ్వరూప్ వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్ నాయకత్వం, మంత్రి విశ్వరూప్ చేపడుతున్న అభివృద్ధి పనులు నచ్చి తాను, తన మద్దతుదారులు వైఎస్సార్ సీపీలో చేరినట్లు కౌన్సిలర్ లక్ష్మి అన్నారు. ఆమెతో పాటు పార్టీలో చేరినవారిలో వాసర్ల వెంకన్న, పరంశెట్టి సూరి, కుడుపూడి శ్రీను, వాసర్ల సుబ్బారావు, యల్లమిల్లి రమేష్ తదితరులున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మట్టపర్తి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమయ్యేందుకే 'జగనన్నే మా భవిష్యత్'

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీ తరఫున ప్రజలతో మమేకమయ్యేందుకే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమమని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల, నగర పంచాయతీ గ్రామ వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజలతో మమేకమై వారి అవసరాలను గుర్తించాలన్నారు. వాటిని తీర్చే బాధ్యత స్థానిక పార్టీ నాయకులు తీసుకుంటారన్నారు. అందుకే గృహసారథులు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి గల వ్యత్యాసాన్ని ప్రజలకు తెలియజెప్పాలన్నారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగాభవానీ, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, పెయ్యల చిట్టిబాబు, పెన్మత్స చిట్టిరాజు, కోలాబాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై బుధవారం ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సచివాలయాల కన్వీనర్ దున్నా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ నుంచి అన్ని సచివాలయాల్లో గృహ సారథులు, కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, పార్టీ రాష్ట్ర నాయకులు దున్నా జనార్దనరావు, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, మహిళా అధ్యక్షురాలు రేవు మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా తెప్పోత్సవం




స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. వేకువ జామునే స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం ఆరు గంటలకు కేరళ వాయిద్యాలతో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు గౌతమీ గోదావరి నదిలో విద్యుత్ దీపాలతో అలంకరించిన హంస వాహనంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తెప్పోత్సవం కార్యక్రమం నిర్వహించారు. బాణసంచా కాల్పులు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో పిల్లలు చేసిన కుచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గురువారం గౌతమీ గోదావరి నదిలో స్వామివారి చక్రస్నానం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో సత్యనారాయణరాజు వివరించారు.


పంట నమోదు రైతుల జాబితా ప్రదర్శన

కపిలేశ్వరపురం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల్లో 2022–23 రబీ పంట నమోదు చేయించుకున్న రైతుల జాబితాను ఆయా కేంద్రాల్లో ప్రదర్శించినట్టు మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ బుధవారం తెలిపారు. 15,882 ఎకరాలకు చెందిన 11,033 మంది రైతులు తమ పంటను నమోదు చేయించుకున్నారన్నారు. 13 గ్రామాల్లోని 618 ఎకరాల పంట పెండింగ్‌లో ఉందని తెలిపారు. నేలటూరులో 7.11 ఎకరాల్లోనూ, వల్లూరులో 59.03, వడ్లమూరులో 0.96, కాలేరులో 14.82, నల్లూరులో 34.04, వెదురుమూడిలో 2.37 ఎకరాల్లో ఈకేవైసీ నమోదు పెండింగ్‌లో ఉందన్నారు. అంగరలో 8.5, పడమర ఖండ్రికలో 8.45, తాతపూడిలో 70.49, కపిలేశ్వరపురంలో 98.49, మాచరలో 224.23 ఈకేవైసీ నమోదు పెండింగ్‌లో ఉందని ఏఓ తెలిపారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు



బాబూ జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జేసీ ధ్యానచంద్ర, ఏఎస్పీ లతామాధురి



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి



ముమ్మిడివరంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

అమలాపురం టౌన్: మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ 115వ జయంతి సందర్భంగా స్థానిక బుద్ధవిహార్ వద్ద మెయిన్ రోడ్డులోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి మంత్రి పినిపే విశ్వరూప్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 115వ జయంతి వేడుకలు అమలాపురంలోని జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో బుధవారం ఘనంగా జరిగాయి. కలెక్టర్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ ధ్యాన చంద్ర, ఏఎస్పీ కె.లతా మాధురి, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తదితరులు నివాళులర్పించారు. ఎస్పీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అల్లవరం: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 115వ జయంతి వేడుకల్లో భాగంగా గోడిలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పూలమాల వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తాళ్లరేవు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఎంపీడీఓ ఎం.అనుపమ తదితరులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఐ.పోలవరం: మురమళ్ల ఎంపీపీ పాఠశాలలో ఏపీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు.

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తంలో జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముమ్మిడివరం: సమసమాజ స్థాపనకు మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం ముమ్మిడివరం పోలమ్మ చెరువు వద్ద గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే పొన్నాడ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యానాం: స్థానిక భీమ్‌నగర్ రహదారిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఇన్‌చార్జి ఆర్ఏఓ డాక్టర్ టి.రవిశంకర్, ఎస్పీ రఘునాయగం, దళితనాయకుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అమలాపురం రూరల్: అమలాపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో ఎస్‌వీఎస్ వసంత రాయుడు బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. నడిపూడి జగ్జీవన్‌రామ్ భవన్ వద్ద ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

తీర గ్రామం నుంచి ఢిల్లీ వరకూ...

- సెంట్రల్ హెల్త్ సర్వీసెస్‌కు ఎంపికైన దుర్గాభవాని
- గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం



డాక్టర్ మేడా దుర్గాభవాని

యానాం: ఆమెది మారుమూల తీరప్రాంత మత్స్యకార గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం.. తల్లిదండ్రులు చదువుకోలేదు.. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం.. అయినా ఇవేమీ ఆమెకు అడ్డంకులు కాలేదు. తల్లిదండ్రులు నిరక్ష్యరాస్యులైనా తాను మాత్రం ఉన్నతంగా విద్యనభ్యసించాలని చిన్నప్పుడే బలంగా నిర్ణయించుకుందామె.. ఆ పట్టుదలే ఆమెను ఢిల్లీ వరకూ నడిపించింది. దేశంలోనే అత్యున్నత పరీక్ష యూనియన్ పబ్లిక్ సర్వీసెస్(యుపీఎస్సీ) కమిషన్‌లో జాతీయస్థాయిలో 57వ ర్యాంకు సాధించి సెంట్రల్ హెల్త్ సర్వీసెస్‌కు ఎంపికయ్యేలా చేసింది. ఆమే నియోజకవర్గ పరిధిలోని శివారు గ్రామం అయ్యన్ననగర్ మత్స్యకార గ్రామానికి చెందిన 23 ఏళ్ల డాక్టర్ మేడా దుర్గాభవాని..

ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ తెలుగు మీడియంలోనే స్థానిక పరంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివింది. అనంతరం ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ స్థానిక నవోదయ విద్యాలయలో విద్యనభ్యసించింది. ఇంటర్ సాయి విద్యానికేతన్‌లో పూర్తిచేసి అత్యుత్తమ మార్కులు సాధించింది. ఫలితంగా ఎంబీబీఎస్‌ను పుదుచ్చేరిలోని ఇందిరాగాంధీ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదివారు. ఈ నేపథ్యంలో ఇంటర్న్‌షిప్ పూర్తి కాకుండానే చివరి సంవత్సరంలో దుర్గాభవాని కేంద్ర సర్వీసులైన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్ష రాసి అత్యుత్తమ ర్యాంకు సాధించింది. దీంతో ఆమె సెంట్రల్ హెల్త్ సర్వీసెస్‌లో మెడికల్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నియామకాన్ని ధ్రువీకరిస్తూ ప్రత్యేకంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం విశేషం. మత్స్యకార గ్రామం నుంచి వెళ్లి ఢిల్లీలో అత్యుత్తమ ఉద్యోగం సాధించడంతో దుర్గాభవానిపై అటు గ్రామస్తులు, స్థానిక ఉపాధ్యాయులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

తల్లిదండ్రులు, సోదరుల ప్రోత్సాహమే..

సెంట్రల్ హెల్త్ సర్వీస్‌కు ఎంపికైన డాక్టర్ మేడా దుర్గాభవాని బుధవారం సాక్షితో మాట్లాడుతూ తమది సామాన్య కుటుంబమైనా అమ్మానాన్న సావిత్రి, అప్పారావులతో పాటు తన సోదరులు సింహాద్రి, గంగాధరరావులు ఉన్నత విద్య చదువమంటూ ప్రోత్సహించారని, ఈ స్థాయికి రావడానికి వారే కారకులని సంతోషం వ్యక్తం చేశారు.

జీతాల బకాయిలు చెల్లించాలి

ముమ్మిడివరం: సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల జీతాల బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో డీఈఓ ఎం.కమలకుమారికి వినతిపత్రం అందజేశారు. ఫిబ్రవరి, మార్చి నెల జీతాలను వెంటనే విడుదల చేయాలని, 2020 పీఆర్‌సీ వర్తింపజేయాలని, కాంట్రాక్టు ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని తదితర డిమాండ్లతో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీఆర్‌పీల అధ్యక్ష, కార్యదర్శులు, ఐఆర్‌టీ అధ్యక్ష, కార్యదర్శులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, ఆపరేటర్లు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.